## మైసమ్మదేవతను దర్శించుకున్న మంత్రి జూపల్లి



మైసమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి జూపల్లి

పెద్దకొత్తపల్లి, డిసెంబర్ 10 : మండలంలోని నాయినోనిపల్లి మైసమ్మ దేవతను ఆదివారం ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సందర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మంత్రిని సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతాప్‌గౌడ్, జెడ్పీటీసీ గౌరమ్మ, మైసమ్మ ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాసులు వివిధ గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు తదితరులు ఉన్నారు.

## ఎలికట్ట వాసికి 'మహాత్మాగాంధీ పీస్ ఇంటర్నేషనల్' అవార్డు

కల్వకుర్తి, డిసెంబర్ 10 : మండలంలోని ఎల్లికట్ట గ్రామానికి చెందిన వేణుగోపాల్‌కు 'మహాత్మాగాంధీ పీస్ ఇంటర్నేషనల్' అవార్డు వరించింది. మనసేవా సమితి ఆధ్వర్యంలో గ్రామాల్లో చేసిన సేవా కార్యక్రమాలను గుర్తించి అవార్డును అందజేశారు. శనివారం హైదరాబాద్‌లోని సిటి కల్చరర్ సెంటర్ హాల్‌లో నిర్వాహకులు అవార్డును ప్రదానం చేశారు. కార్యక్రమంలో సినీ డైరెక్టర్, యాక్టర్, శ్రీనివాసులు, సూపరింటెండెంట్ అంజనీకుమారి, కరీముల్లా, ప్రిన్సిపాల్ నారాయణ పాల్గొన్నారు.

## వైభవంగా అయ్యప్పస్వామికి పూజలు

బిజినేపల్లి, డిసెంబర్ 10 : మండల కేంద్రంలో ఆనందగిరి గుట్టపై ఉన్న అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీకమాసం సందర్భంగా అయ్యప్ప స్వాములు ఆలయానికి చేరుకుని స్వామివారికి అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. దీంతో ఆలయ ప్రాంగణమంతా అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో రవి, శీను పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 10 : జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) రాతపరీక్ష ప్రశాంతంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. జిల్లాలో మొత్తం 649 మందికి గానూ 614 మంది విద్యార్థులు హాజరు కాగా 35 మంది గైర్హాజరయ్యారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు పరీక్ష నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత మూడు పాఠశాలలో పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణ అధికారి రాజశేఖర్ రావు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి, సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రతి సంవత్సరం రూ.12వేల వరకు ఐదేండ్ల పాటు ఉన్నత చదువులకు స్కాలర్‌షిప్ అందనున్నట్లు తెలిపారు.

## కాడెద్దును ఢీకొన్న బైక్.. వ్యక్తి మృతి

లింగాల, డిసెంబర్ 10 : బైక్‌పై వెళ్తూ కాడెద్దును ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకున్నది. గ్రామస్తులు కథనం మేరకు మండలంలోని అవుసలికుంటకు చెందిన వడ్ల మధు (37) ఆదివారం సంత కావడంతో లింగాలకు వచ్చిసంతలో కూరగాయలు తీసుకొని తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన ఓ రైతు వ్యవసాయ పనులను ముగించుకొని ఎద్దులపై కాడి వేసుకొని ఇంటికెళ్తున్న సమయంలో వెనుకవైపు నుంచి ఎద్దును ఢీ కొట్టాడు. తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య అరుణ, ఒక కుమారుడు ఉన్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి పంచనామా నిర్వహించారు.

# ప్రతిఒక్కరూ దైవభక్తిని అలవర్చుకోవాలి

◆ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోళి శ్రీనివాస్‌రెడ్డి



విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొని పూజలు చేస్తున్న గోళి శ్రీనివాస్‌రెడ్డి

వెల్దండ, డిసెంబర్ 10 : ప్రతిఒక్కరూ దైవభక్తిని అలవర్చుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోళి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని నారాయణపూర్ గ్రామంలో అభయాంజనేయస్వామి, శివపార్వతులు, ధ్వజ, నవగ్రహ గణపతి, సుబ్రహ్మణ్యం, నందీశ్వర, నాగదేవతా ప్రతిష్ఠా మహోత్సవం కార్యక్రమంలో గోళి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రతిఒక్కరూ దైవభక్తిని పెంపొందించుకోవాలని అన్నారు. ఆలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ భూపతిరెడ్డి, సామాజికవేత్త పాపిశెట్టి రాము, శ్రీనునాయక్, తారసింగ్ తదితరులు పాల్గొన్నారు.

# శివనామస్మరణతో మార్మోగిన సోమశిల క్షేత్రం



సోమశిలలో గర్భ గుడిలో పూజలు చేస్తున్న భక్తులు

కొల్లాపూర్ రూరల్, డిసెంబర్ 10 : మండలంలోని సప్తనదుల సంగమం ఒడ్డున సోమశిలలో వెలసిన ప్రముఖ పుణ్యక్షేత్రం శివనామస్మరణతో మార్మోగింది. లలితాసోమేశ్వర ఆలయ ఆవరణలో ఆదివారం భక్తులతో కార్తీకమాసం సందర్భంగా ప్రవచనకర్త విద్యాగణపతి పీఠం ఇరువింటి శ్రవణ్‌కుమార్ పర్యవేక్షణలో వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య నందీశ్వరుడికి రుద్రాభిషేకం కనుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సమీప గ్రామాల ప్రజలతో పాటు హైదరాబాద్, కర్నూల్, నాగర్‌కర్నూల్ లాంటి దూరప్రాంతాల నుంచి భక్తులు అశేషంగా తరలివచ్చారు. వందలాది దంపతులు అభిషేక కార్యక్రమంలో పాల్గొన్నారు. గణపతి పూజతో ప్రారంభమైన పూజ కార్యక్రమాలు కార్తీకమాస విశేష దశవిధ హారతులతో స్వస్తి పలికాయి. ఈ సందర్భంగా శ్రవణ్‌కుమార్‌శర్మ మాట్లాడుతూ కార్తీకమాసంలో నందీశ్వరుడికి రుద్రాభిషేకం చేయడంతో ఎంతో మేలు జరుగుతోందని వేదాలు చెబుతున్నట్లు పేర్కొన్నారు. దైవచింతనతో ప్రశాంతమైన జీవనవిధానం కొనసాగుతోందన్నారు. పూజ కార్యక్రమ ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ గోవిందరెడ్డి పర్యవేక్షించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు తాగునీటి సౌకర్యం, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

### ఘనంగా కార్తీక దీపోత్సవం

ఆమనగల్లు, డిసెంబర్ 10 : పట్టణంలోని శ్రీనివాస్‌కాలనీలో ఉన్న బ్రహ్మకుమారీస్ రాజయోగ కేంద్రంలో కార్తీక దీపోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్సై బలరాం ముఖ్యఅతిథిగా హాజరై దీపాలను వెలిగించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు విజయలక్ష్మి మాట్లాడుతూ మనలో ఆత్మదీపాన్ని వెలిగించుకొని అజ్ఞాన చీకటిని , చెడుగుణాలను తొలిగించుకొని జీవించాలన్నారు. కేంద్రానికి వచ్చి యోగా నేర్చుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఏఎస్సై యాదయ్య, కానిస్టేబుల్ శివ తదితరులు ఉన్నారు.

## రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

ఆమనగల్లు, డిసెంబర్ 10 : ఆరుగాలం శ్రమించి సేద్యం చేసిన రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తాసీల్దార్ రఘునందన్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో జాతీయ రహదారిపై పలు చోట్ల వడ్లు ఆరబోసిన రైతులను ఆదివారం ఆయన కలిసి ధాన్యాన్ని పరిశీలించి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న కనీస మద్దతు ధరపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని గ్రేడ్ ఏ, గ్రేడ్ బి రకాలుగా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఈ విషయంలో రైతులు అపోహలు వీడాలని అనవసరంగా దళారులను నమ్మి మోసపోవద్దని ఆయన స్పష్టం చేశారు. తేమ పేరిట మిల్లర్లు క్వింటా వడ్లపై తరుగు వేస్తుంటే దళారులను ఆశ్రయించే పరిస్థితి దాపురిస్తుందని కొందరు రైతులు డీటీతో వాపోయారు.తీసుకువచ్చిన ధాన్యంలో నిర్ణీత తేమ శాతం, నాణ్యత ఉంటే ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కావన్నారు.

# శ్రీశైలంలో కార్తీక సందడి



శ్రీశైలం ప్రధాన వీధిలో భక్తుల రద్దీ

శ్రీశైలం, డిసెంబర్ 10 : శ్రీశైల భ్రమరాంబికా మల్లికార్జున స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో క్షేత్రం సందడిగా మారింది. కార్తీక మాస శోభను సంతరించుకున్న శ్రీశైల మహాక్షేత్రం శివనామస్మరణతో మార్మోగింది. కార్తీకమాసం ఆఖరి వారం కావడం తోపాటు వారాంతపు సెలవులు కలిసిరావడంతో కుటుంబసమేతంగా క్షేత్రానికి చేరుకుంటున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన యాత్రికులు తెల్లవారుజామునే తలనీలాలు సమర్పించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గంగాధర మండపం, ఉత్తర మాడవీధి వద్ద దీపాలు వెలిగించుకొని పూజలు చేసుకొన్నారు. భ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి వచ్చే యాత్రికుల సంఖ్య పెరుగుతూ ఉన్నందున రద్దీ రోజుల్లో గర్భాలయ అభిషేకాలు, స్పర్శ దర్శనాలు తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ఈవో పెద్దిరాజు తెలిపారు.

## ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం

ఉప్పునుంతల, డిసెంబర్ 10 : మండల కేంద్రంలో 1992 సంవత్సరానికి చెందిన పదోతరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విశ్వనాథం, కాశన్న, హన్మంత్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

చారకొండ, డిసెంబర్ 10 : సైబర్ నేరాలపై విద్యార్థులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రవి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రోజు రోజుకు ఆన్‌లైన్ లావాదేవీల్లో మోసాలు జరుగుతున్నాయని, ఫోన్‌లకు వచ్చే లింక్‌లను క్లిక్ చేయకూడదని చెప్పారు.మోసాలపై ఫిర్యాదుకు 1930 టోల్ ఫ్రీ నంబర్, సైబర్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

## ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడిగా మేకల రమేశ్

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 10 : నాగర్‌కర్నూల్ జిల్లా ముదిరాజ్ సంఘం జిల్లా నూతన అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన మేకల రమేశ్‌ను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు రామస్వామి కాంప్లెక్స్‌లో ఏ ర్పాటు చేసిన సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా మేకల రమేశ్, గౌరవ అధ్యక్షుడిగా జింకల గణేశ్, ఉపాధ్యక్షులుగా చంద్రమౌళి, గిరిధర్, ప్రవీణకుమార్, సుధీర్, సురేశ్‌లను ఎన్నుకున్నారు.

## నేటి నుంచి బడిబయట పిల్లల గుర్తింపు

నాగర్‌ర్నూల్, డిసెంబర్ 10 : బడీడు పిల్లలంతా చదువుకోవాలనే లక్ష్యంతో విద్యాశాఖ ఈనెల 11 నుంచి జనవరి 10 వరకు ప్రత్యేక కార్యక్రమం చేపడుతోందని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి షర్ఫొద్దీన్ తెలిపారు. బడిబయట పిల్లల గుర్తింపు పేరిట సర్వేను చేపట్టేందుకు ఆదేశాలు జారీ చేసిందని, దీంతో జిల్లా విద్యా శాఖ అధికారులు ఆ దిశగా చర్యలకు చేపడుతుందన్నారు. ఇందుకుగానూ మండల విద్యాశాఖ అధికారులు, కాంప్లెక్స్ హెచ్ఎం, సీఆర్పీ(క్లస్టర్ రిసోర్స్ పర్సన్)లకు శిక్షణ పూర్తి చేశారన్నారు. ఈ నెల 11 నుంచి జనవరి 10 వరకు విద్యా శాఖ పరిధిలోని సమగ్రశిక్షఅభియాన్ కింద పని చేసే సీఆర్పీలు క్షేత్ర స్థాయిలో ఇంటింటా తిరిగి వివరాలు సేకరిస్తారన్నారు.

## ఆలయాల్లో ప్రత్యేక పూజలు

పాన్‌గల్, డిసెంబర్ 10 : కార్తీకమాసం చివరి ఆదివారం సందర్భంగా మండల కేంద్రంతో పాటు కేతేపల్లి, తెల్లరాళ్లపల్లి గ్రామాల్లోని వెంకటేశ్వర, ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు చేశారు. ఆయా గ్రామాల్లో మహిళలు తెల్లవారుజామున ఆలయం చుట్టూ దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

## 12న కార్తీక వనభోజనాలు

అచ్చంపేట టౌన్, డిసెంబర్ 10 : ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు ఈనెల 12వ తేదీన పట్టణ శివారు పరిసర ప్రాంతంలోని పల్కపల్లి శివాలయం గుడిబండ క్షేత్రంలో నిర్వహిస్తున్నామని సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ఆదివారం ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు వాసవీమాతా పూజ కార్యక్రమాలతో ప్రారంభమై సాయంత్రం 4 గంటలకు ముగుస్తాయని తెలిపారు.

## సెలవుదినాల్లో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు

అచ్చంపేట టౌన్, డిసెంబర్ 10 : ప్రైవేట్ పాఠశాలలో సెలవుదినాల్లో ప్రత్యేక తరగతుల పే రిట విద్యార్థులకు ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంఈవో రామారావు అన్నారు. ఆదివారం పట్టణంలోని శ్రీచైతన్య టెక్నో హైస్కూల్ నిబంధనలకు విరుద్ధంగా ఆదివారం సెలవుదినం కూడా ప్రత్యేక తరగతుల పేరిట క్లాసులు నిర్వహిస్తున్నారని తెలంగాణా ప్రైవేట్ టీచర్స్ ఫోరం అచ్చంపేట అధ్యక్షుడు రవినాయక్ ఎంఈవో ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన శ్రీచైతన్య పాఠశాలలకు వెళ్లి తనిఖీ నిర్వహించారు. విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులకు చర్యలు తీసుకోవాల్సిందిగా నివేదికలను అందించినట్లు ఆయన తెలిపారు.